# అవాంతరాలు

❋ రచన. డి వి ల. ❋

[గమనిక : ఈ రచన, రచనలోవుండే పేర్లు కల్పితం — కేవలం వినోదార్థమే వ్రాయబడినదేగాని, ఏ వ్యక్తిని ఉద్దేశించి వ్రాయబడలేదు — డి.వి.ల.]

మానవ జీవితంలో ఎప్పుడూ ఏవో అవంతరాలు వస్తూండడం సహజమనే అందాం. కాని మనుష్యులు మాత్రం వాటిని తట్టుకోలేక తలక్రిందులై చివరకు ఒక నిట్టూర్పు విడవడం సాధారణంగా జరిగే విషయమే అనాలి. ఎప్పుడూ కాలం ఒక్కమాదిరిగా ఉండదు కనుక కాలానుగుణ్యంగా అనేక రకరకాల సంఘటనలు, మార్పులు తటస్థించడం కూడా ఒక్క తప్పనిసరే మరి. ఎంతచెప్పినా కాల ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు కనుక తదనుగుణ్యంగా వచ్చే మార్పులు తప్పనిసరే అనుకొని సమర్థించుకొంటె సరిపోతుందేమో. 'జీవితం అంతా అల్లకల్లోలం' అనే చిన్న వేదాంతవాక్యాలు నాలుగు వల్లించుకుంటూ ఉండడం చాల ఉత్తమమైన విషయం క్రింద గమనించుతే సరిపోతుంది.

ప్రతి సంవత్సరం ప్రారంభం దగ్గరనుంచి పూర్తి అయే వరకు ఏవేవో అవాంతరాలు వస్తూనే ఉంటాయి. ఈమధ్య వచ్చినవాటిలో తుపాను ఒకటి చాలా చెప్పుకోతగ్గదే. మరి ఎంతమంది చచ్చిపోలేదూ ? ఎంత నష్టం నిజంగాను — రైళ్లు నడవలేకపోవడం — ఒక టేమిటి నానారకాల అవస్థలు — కాలేజీలు, స్కూళ్లు మూసివెయ్యడం — పిల్లలు బడుద్ధాయిల్లా రోడ్లమ్మట తిరగడం ఇత్యాదులు. కాని యీ తుపానుగాలికి ఆంధ్ర రాష్ట్రం కొట్టుకురావడం అనేది ఒక గొప్ప విషయమే. వెనకటికి క్వెట్టా భూకంపం రావడంవల్ల భూమిమీద అనేక మార్పులు వచ్చాయి. అల్లాగే తుపాను తరువాత వచ్చిన మార్పులేవో మరి! యీ తుపానే ఆంధ్ర రాష్ట్రం రావడానికి కారణం అన్నారు చాలామంది. కాని మద్రాసు వదులుకోవడంవల్ల మన పరోపకారబుద్ధిని, విశాలభావాల్ని, మెచ్చుకోబడుతున్నాయనే సంతృప్తి మనలో జీర్ణించడం, సదరు ఏ కారణంచేతనైనా మనకి మద్రాసులో స్థానం దొరికినా నిర్మోహమాటంగా నిరాకరించడానికి సంసిద్ధులై ఉన్నాం కనుక రాబోయే రాష్ట్రానికి ముఖ్యపట్టణం సంగతి ఒక పెద్ద సమస్యయై ఊరుకుంది. ఇలాగే ఒక సమస్య తరువాత ఇంకొకటి తోకలా ఉంటూనే ఉంటాయి.

ఈ గొడవతోపాటు ఇంకో గొడవ ఏమిటంటే హిందూ కోడు బిల్లు — విడాకుల చట్టం వగైరా — ఇది అందరికి సంబంధించింది కనుక పెద్ద అవాంతరమే అయింది. ప్రతి వ్యక్తి ఈ విషయం గురించిన చర్చే — ఎవడిమట్టుకు వాడికి లోపల చాలా దడగానే ఉంటోంది. ఈ బిల్లు ప్యాసు అయిన మర్నాడు తమ భార్యలంతా లేచిపోతారామో అన్న భయం చాలామందికి.

"స్త్రీలు యింక భర్తలయందు వినయ విధేయతలు చూపరు 'కార్యేషుదాసి' శ్లోకం అంతా తారుమారు అవుతోంది" అని విచారించాడు మా లంబోదరం.

"స్త్రీ సామ్రాజ్యం అంటె ఏవో పుస్తకాల్లో చదివాం కాని ఇప్పుడు నిజంగానే వస్తోంది. స్త్రీ ఆస్తి కలిగింది అవుతోంది కనుక స్వేచ్ఛ రాబోతోంది. అంచేత ఇప్పుడు భార్యని అర్థాంగి అనడం అట్టే మంచి పని కాదు" అన్నాడు మాశబ్ద రత్నాకరంగారు.

"భార్య విలువ హెచ్చింపబడుతోంది అంటే రూపాయి విలువ తగ్గినట్లు భర్త విలువ తగ్గుతోందన్న మాట — ఇదంతా అర్థాంగి పూర్ణాంగి అవడంవల్ల వచ్చేడి గందరగోళం" అన్నాడు ఓ సంసారి.

ఈ హిందూ కోడు బిల్లు ప్రవేశంవల్ల సనాతన ధర్మాల్లో మార్పులు చాలా తీసుకురావడం — అంచేత సంఘంలో అనేక సమస్యలు బయలుదేరి ప్రతి వ్యక్తికి దీనిపైన చర్చ అత్యావశ్యకమనుకొని తమ ఉద్దేశాలని బైటపారెయ్యడం జరుగుతోంది.

మగపిల్లలు ఎక్కువగా ఉన్నవాళ్లు బిల్లు రానివ్వండనే అంటున్నారు. కారణం ? — కట్నాలకంటె ఆస్తి బాగా తెచ్చుకునే ఆడవాళ్లను సంపాదించడం ఎంత లాభం నిజంగాను ? ఆడవాళ్లను పోషించవలసిన అవసరం ఇంక ఉండదుగా. అంచేత 'మాపెద్దాడికి ఎంత ఆలస్యమైనా బిల్లు

పాసు అవుతేనేగాని పెళ్లి చెయ్యను' అంటున్నాడు మా దురాశయ్యగారు.

ఇంకో ముఖ్య విషయ మేమంటె మా నరసింహులు గారిలో వచ్చిన మార్పు—నిత్యం భోజనం దగ్గర ఏ చారు లోనో చింతపండు తక్కువైందన్న కారణం ఆధారంగా చేసుకొని ఆయన దూర్వాస మహాముని అయిపోయి ఆవిడ వీపుమీద వెదురు బద్ద విరవడం—పాపం ఆ యిల్లాలు చేసేదేమీలేక షడ్జమస్థాయిలో స్వరం మొదలుపెట్టేసరికి ప్రక్కింటివాళ్లందరూ యీ నాటక ప్రదర్శనానికి, టిక్కెట్లు అవసరంలేదు కనుక, హాజరవడం జరుగుతూనే ఉండేది. కాని యీ విడాకుల బిల్లు సంగతి ఎవరో అంటోంటె విన్నాడుగాని మొదటమాత్రం విడాకులు అంటె అడ్డాకులులాంటి ఇవోరకం విస్తరాకులు గావును అనుకొని చివరికి యదార్థం తెలిసి తనలో వచ్చిన వికారా లని అణచి యీ విషయం ఏమాత్రం తెలిసినా ఆవిడ లేచి పోతుందనే భయంతో యీ మధ్య చిలకా గోరింకల్లా చాలా అన్యోన్యంగా ఉండడం దేశంలో వచ్చిన పెద్ద మార్పుల్లో ఒకటి.

మరి మంగమ్మగారి సంసారంలో ఉన్న నిత్య తుపాను ఘట్టంలోని మార్పుకూడా చెప్పుకోతగ్గదే. ఆవిడ సుబ్బా రావుగారిమీద రాత్రి రెండు ఝాములదాకా దండకం చదివేస్తూ ఉండడం—ఒకవేళ ఆవిడ చేతిలో ఏ రోకలో ఉంటె సుబ్బారావుగారు వెంటనే వీధి గుమ్మంలోకి వెళ్లి అప్పుడు ఆవిడపై పంచాంగ శ్రవణం చెప్పడం, ఇతరులకు నిద్రాభంగం కలగడం జరుగుతూ ఉండేది. కాని యీ విడాకుల బిల్లు సంగతి ఆవిడకు తెలిసి తను అమాంతగా సావిత్రి అయిపోయి ఆయన్ని ఒక సత్యవంతుణ్ణి క్రింద జమ కట్టెయ్యడంవల్ల యిరుగుపొరుగు యీ యుద్ధకాండ వినవలసిన అగత్యం తప్పింది.

రాబోయే యీ అవాంతరపు బిల్లు గురించి ఎవరు మట్టుకు వాళ్లు తమ లాభనష్టాలని ఎంచుకోవడం మొదలు పెట్టారు. "విడాకులు బిల్లు ప్రవేశంవల్ల తగవుల ఎక్కువగా పెరిగిపోవచ్చు. కనుక దీనిని మనం ఏకగ్రీవంగా ఆహ్వానించాలి" అన్నారు చెట్టుక్రింద ప్లీడర్ల సంఘం అధ్యక్షులు ఉపన్యాస ధోరణిలో.

'ఆడవాళ్లకి ఆస్తి వస్తోంది అన్నారు. జీతం వచ్చినప్పుడల్లా ఏ చీరో కొనవలసిన రివాజు తప్పుతుంది కనుక జీతం ఖర్చు అయిపోయిందని చెప్పి నమ్మించలేక చివరికి విరిగి పోయిన పాల కాఫీ త్రాగడం, ఉప్పులేని కూర తినడం వగైరా బాధలు ఉండవన్నాడు' ఒక ఉద్యోగి ఏదో పెద్ద అనుభవం ఉన్నవాడలా—

"ఐతే గృహకృత్యాల్లో ఖర్చు భార్యా భర్తలు ఇద్దరు సమానంగా భరించాలి. 'సంసారమంతా భర్తమీద ఆధార పడడం' అనే దానికి అర్థం మారింది అన్నాడు." ఒకా యన.

"కాని స్వంత ఖర్చులు మాత్రం ఒకరివి ఇంకొకరు భరించడం కష్టం. ఎందుకంటె ఒక చీర విలువకి అరడజను ఖండువాలో రెండు జతల పంచలో కొనడానికి వీలుంది. కాబట్టి అదనపు ఖర్చు భర్త భరించడం అసమంజసమే" అన్నాడు ఒక ఆర్థిక శాస్త్రజ్ఞుడు.

సనాతన దృష్టి ఉన్నవాళ్లలో మరీ కలవరం సంభవించింది. "ఆడ మగ వివక్షత లేకుండా చేయడం కేవలం ఎరితో పాపానికి ఒడికట్టుకు పోతేనేగాని జరగదు. అందుకనే పంచాంగంలో పాపం 19 పాళ్లో 20 పాళ్లో ఉంటే పుణ్యం 2 పాళ్లో 3 పాళ్లో కనబడుతోంది" అన్నారు మా సిద్ధాంతిగారు.

తమకి వచ్చి పడనున్న హక్కుల్ని బట్టి ఇంక ముందు ఎల్లా సంచరించాలా అనే చర్చ చాలా ఎక్కువైంది. కొందరి ఆడవాళ్లలో చేసిన తీర్మానం ఏమంటె ఇకముందు నుంచి యావన్మంది తమ భార్యల్ని ఏపనీ అథమాయించి చేయించుకోడానికి వీలులేదు. అంటె ముందు పంచ రత్నాలు చదవడమో లేక ఏ శ్రీనాథుడో వ్రాసిన నాలుగు శృంగార పద్యాలో చదివి ఆవిడను ఒక దేవతా స్త్రీ క్రింద చేసి ఒక నివేదికను సమర్పించడమే.

"బహు భార్యానిషేధంకూడా బిల్లులో చేర్చడంవల్ల ఇదికూడా కొన్ని సందేహాలకి గురిఐంది. పురుషులు సమాన సంఖ్యగా లేకపోతే మిగిలిన శేషం సంగతి ఏమిటన్నారు." ఓ లెక్కల మేష్టారు.

కాని ఆ మాత్రం శేషం మిగలకపోతే విధవ వివాహాలు జరగడం ఎల్లాగ మరి!

★